క్లుప్తంగా

ఆక్రమణలు తొలగించాలని ఆర్డీవోకు వినతి

తాళ్లపూడి: పెద్దేవంలో ఆక్రమణలు తొలగించి గ్రామాభివృద్ధికి, పంచాయతీ తీసుకున్న నిర్ణయాల అమలుకు సహకారం అందించాలని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు సోమవారం వినతిపత్రంలో అందజేశారు. గ్రామంలో ఆక్రమణకు గురైన స్థలాలు, రోడ్డుపైకి వచ్చిన గోడలను, మెట్లను, చెట్లను గతంలోనే పంచాయతీ తీర్మానం ద్వారా కొన్ని తొలగించామని తెలిపారు. మరికొన్ని ఆక్రమణల తొలగింపునకు అధికారుల సహకారం అందించాలని కోరినట్టు వారు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం తగదు

పెరవలి: పంట సాగు చేసినా, చేయకపోయినా నీటితీరువా పన్ను తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తోందని, ప్రభుత్వ నుంచి ఆశించిన మేరకు సహకారం అందడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం తగదని అన్నదాతలు అన్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఎప్పటికి వస్తాయంటూ కాకరపర్రు, పెరవలి, కొత్తపల్లి అగ్రహారం రైతులు అధికారులను ప్రశ్నించారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించి 2, రెవెన్యూకు సంబంధించి 1 అర్జీ అందినట్టు తహసీల్దార్ డి అచ్యుతకుమారి తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామని వ్యవసాధికారిణి మేరీ కిరణ్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

తాళ్లపూడి: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి మోటార్ వాహనాలు నడిపితే చట్ట రీత్యా నేరమని, రవాణా శాఖ కొత్తగా మార్పు చేసిన నిబంధనలు పాటించకపోతే అపరాధ రుసుం వేలల్లో చెల్లించాల్సి ఉంటుందని తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా చిన్న వయస్సున్న వారికి మోటార్ వాహనాలు ఇస్తే అదనంగా అపరాధ రుసుము వసూలు, అవసరం మేరకు కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు



వేగేశ్వరపురంలో ప్రకృతి వ్యవసాయదారులను సత్కరిస్తున్న సర్పంచ్, సిబ్బంది

తాళ్లపూడి: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. వేగేశ్వరపురం రైతు భరోసా కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. రైతులు పెట్టా సుబ్బారావు, తైలం చంద్రశేఖర్, పోతిరెడ్డి గానిరాజు, తైలం వీరవెంకటసత్యనారాయణను సర్పంచ్ పరశురామారావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా రబీలో సాగు చేసిన వరి పంట మంచి దిగుబడులు వచ్చాయని అన్నారు. మిగిలిన పంటలు కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగాంజనేయులు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భీష్మాంభ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వరలక్ష్మి పాల్గొన్నారు.

చదువు ద్వారా ఉన్నత స్థితి

తాళ్లపూడి: చదువు ద్వారా ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవచ్చని మండల ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద మలకపల్లి దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మరపట్ల అరుణ్‌కుమార్‌కు శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పదో తరగతి, ఇంటర్ తరువాత విద్యార్థులు ఎంపిక చేసుకోవాల్సిన కోర్సుల వివరాలను తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్‌వో హాజరయ్యారు. శెట్టిమాలి మోహన్ మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదివి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలన్నారు. డీఎస్ఎఫ్ అధ్యక్షుడు నేరేడిమెల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ దాసరి హితేష్, సెక్రటరీ కొనాల అభిషేక్ వర్మ, ట్రెజరర్ దాసరి రాకేష్, అడ్వైజర్స్, సభ్యులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

కొవ్వూరు: అసంఘటిత కార్మికుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలున్నాయని, కార్మికుల బీమా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి పేర్కొన్నారు.సోమవారం నందమూరులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో అసంఘటిత కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. న్యాయవాదులు పిహరీష్, పీవీపీ లక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం ఒబ్బిడిలో రైతన్నల నిమగ్నం

- వ్యవసాయదారులకు అకాల వర్షాలతో నష్టం
- రోడ్లపై తడిసిన ధాన్యం ఆరబోత
- ధాన్యం కొనుగోళ్లు లేక అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం



వడలి- ముక్కామల రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న ముత్యాలవారిపాలెం రైతులు



నల్లాకులవారిపాలెంలో తడిసిన ధాన్యం బస్తాలు

పెరవలి: అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. ధాన్యం కొనుగోలు చేసే నాథుడు లేక అల్లాడుతున్న రైతులను ఇటీవల కురిసిన అకాల వర్షాలు వారి నడ్డివిరించదని చెప్పవచ్చు. చేతికి అందిన పంట నోటికి దక్కకుండా పోతుందనే ఆందోళనలో రైతులున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిచిపోగా, కోత కోయని వరిచేలు నేలకొరిగాయి. సోమవారం ఉదయం మేఘాలు కమ్ముకోవడంతో రైతులు కంగారుపడినా తరువాత ఎండ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో బరకాల్లో కప్పి ఉంచిన ధాన్యం రాశులను తెరిచి రోడ్లపైకి చేరవేసి ఆరబెట్టారు. కళ్లాలు, పొలాల్లో నెట్టులు కట్టిన ధాన్యం బస్తాలు ఆదివారం కురిసిన వర్షానికి తడిసిపోవడంతో వాటిని ఆరబెట్టారు.

వాతావరణ శాఖ హెచ్చరికతో రైతుల ఆందోళన

వాతావరణ శాఖ మరో 2 రోజులు వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడిచిన ధాన్యం ఆరిపోతే ఎలాగోలాగా కాపాడుకోవచ్చని, కోతలు పూర్తి కాని పంట ఏమైపోతుందోనని రైతులపాటు కౌలు రైతులు భయపడుతున్నారు. వాతావరణ శాఖ చెప్పినట్లు 2 రోజులు వర్షాలు కురిస్తే ఇక పంట దక్కదని పూర్తిస్థాయిలో నష్టపోవలసి వస్తుందని వారు వాపోతున్నారు.

ఎండ రావడంతో ఊపిరి పీల్చుకున్న రైతులు

అకాల వర్షం రైతులను నిలువునా ముంచినా సోమవారం తెరిపివ్వడంతో రైతులు చేలల్లో ఉన్న ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చి ఆరబెట్టారు. పెరవలి మండలంలో నిడదవోలు-నరసాపురం, వడలి-ముక్కామల, జాతీయ రహదారి పూర్తిస్థాయిలో రోడ్లపైకి ధాన్యం చేరడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై ఆరబెట్టిన తడిసిన ధాన్యాన్ని వాహనదారులు చూసి అయ్యో అంటున్నారు. వడలి- ముక్కాల రోడ్డుపై వాహనచోదకులు పూర్తిగా వన్ వేలోనే ప్రయాణం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలుకు రాని అనుమతులు

నిడదవోలు నియోజకవర్గంలో 8,650 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలిచ్చినా సోమవారం వరకు ఆ ఆదేశాలు మిల్లర్లకు అందకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉంది. నియోజకవర్గంలో నిడదవోలులో 5,020 టన్నులు పెరవలి మండలంలో 2,950 టన్నులు, ఉండ్రాజవరంలో 680 టన్నుల కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశాలిచ్చారు. పెరవలి మండలంలో ధాన్యం 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు అంచనాలు వేసినా 2,950 టన్నులే కొనుగోలుకు చేస్తారని తెలియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే అకాల వర్షాలు ఊపిరి తీసుకోనివ్వడం లేదని, మరో వైపు ధాన్యం కొనుగోలులో నిబంధనలు, అనుమతులు పేరుతో అధికారులు జాప్యం చేయడంతో రైతులు పాట్లు వర్ణాతీతంగా ఉన్నాయి.

ఆందోళన చెందుతున్నాం



వర్షాలు మరో రెండు రోజులు ఉంటాయని వాతావరణ శాఖ తెలపడంతో మాకు భయం పట్టుకుంది. చేతికి అందిన ధాన్యం నోటికి దక్కుతుందా అని ఆందోళన చెందుతున్నాం. సోమవారం కూడా అనుమతులు రాలేదంటున్నారు. ఈ ఆపత్కాలంలో ఏమి చెయ్యాలో దిక్కుతోచడం లేదు.

– లొల్ల నాగేశ్వరరావు, రైతు, పెరవలి

రైతులు, కౌలుదారులు అవస్థలు



ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవటం వలనే రైతులకు ఈ పాట్లు. పంట బాగా పండిందని ఆనందించాం. కానీ అకాల వర్షాలు, ధాన్య కొనుగోలులో జాప్యంతో ఇన్ని తిప్పలు పెడతారని అనుకోలేదు. వ్యవసాయంలో ఇబ్బందులను గుర్తించి వాటిని సరిదిద్దాల్సిన అధికారులు పట్టించుకోవడంతో రైతులు, కౌలుదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

– పిల్లా శ్రీనువాస్, రైతు, కొత్తపల్లి అగ్రహారం

డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలసిన నాయకులు



రాజమహేంద్రవరంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ ప్రభుత్వ హాస్పిటల్లో న్యూరాలజీ వార్డులో చికిత్స పొందుతున్న పెద్దేవం గ్రామం 5వ వార్డుకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బొర్రా సూరిబాబుకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దేవం సర్పంచ్ తిరిగిపల్లి వెంకట్రావు, మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, పార్టీ నాయకులు నల్లాకుల వేణుగోపాలకృష్ణ, కోడి గంగారావు ఉన్నారు.

ఆధునిక విజ్ఞానం వైపు అడుగులు వేయాలి



ధర్మవరంలో వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కొవ్వూరు: వ్యవసాయం లాభదాయకం చేసుకోవడానికి రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విజ్ఞానాన్ని పెంచుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలో ధర్మవరంలో సోమవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణ, అధిక దిగుబడి, తెగుళ్లను తట్టుకునే వంగడాలను వాడడం ద్వారా సేద్యాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చని అన్నారు. మార్కెటింగ్ పరిజ్ఞానం, వివిధ పంటల్లో అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తుల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. నైరా కళాశాల విద్యార్థులకు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఏరువాక జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ నాలుగు నెలలు నుంచి గ్రామాల్లో రావెప్ విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక దిగుబడి అందించే వరి రకాలను సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా రైతులు అడుగులు వేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ ఎస్. జయరామలక్ష్మి,మండల వ్యవసాయ శాఖా ధికారి ఎ.గంగాధర్,శాస్త్రవేత్తలు తిరుమల రెడ్డి, ఇంజనీర్ అప్పారావు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



వినతుల స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సత్వరం పరిష్కరించే దిశగా డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు.ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదిక-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆర్డీవో వినతులు స్వీకరించి పరిష్కార మార్గాలు చూపించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై వారానికి రెండు రోజులు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేసి చెప్పవచ్చునన్నారు. నిడదవోలు మండలం కలవలచర్లకు చెందిన మల్లిపూడి మహాలక్ష్మి, తన సొంత ఇంటిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.పెరవలి మండలం అర్జరం గ్రామానికి చెందిన ఉమ్మడి మార్గం వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. ఇన్‌చార్జ్ ఏవో రవి విక్రమ్, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు



వద్దూరు రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ఉండ్రాజవరం: ప్రస్తుత రబీ సీజన్‌లో 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మండలంలో పసలపూడి, వడ్లూరు, చివటం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో రాణి సుస్మిత కలసి సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రస్తుత 2024-25 రబీ సీజన్లో వరి ధాన్యం సేకరణలో రికార్డ్ దిశగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. తొలుత 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యం కాగా, గతంలో ఎన్నడూ లేనంతగా 3 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధ్యాన్యాన్ని సేకరించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా పరిధిలో రైతు ఖాతాలో రూ.477.44 కోట్లు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. చివటంలో స్వామిత్వ సర్వే ప్రక్రియను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శాంతమణి, డీఎల్‌పీవో అమ్మాజీ, తహసీల్దార్ పీఎన్‌డీ. ప్రసాద్, ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, ఏవో విశ్వాసరావు పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలకు డిమాండ్



పెరవలిలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయిస్తున్న రైతులు

పెరవలి: సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వివిధ రకాల కూరగాయలను పెరవలి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయ వద్ద సోమవారం స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించారు. సేంద్రియ ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రతి సోమవారం సేంద్రియ వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్న కూరగాయల దుకాణాలకు వినియోగదారులు పోటెత్తుతున్నారు. సామాన్యులతోపాటు అధికారులు వచ్చి ఈ దుకాణం ఎప్పుడు తెరుస్తారా అని ఎదురుచూసి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఈ దుకాణాల్లో ఆకు కూరలు, అన్ని రకాల కూరగాయలతో పాటు మామిడి, బొబ్బర్లు విక్రయించారు. దుకాణం ఏర్పాటు చేసిన కేవలం గంటలో కూరగాయలన్నీ అమ్ముడైపోడంతో రైతులు ఆశ్చర్యపోతున్నారు. ఇటువంటి దుకాణాలు ప్రతి రోజూ ఉంటే చాలా బాగుంటుందని స్థానికులు అంటున్నారు. రుచి, ఆరోగ్యం ఈ కూరగాయలు వినియోగించటం వలన లభిస్తుందని వినియోగదారులు అంటున్నారు.

చిన్నారావుకు ఘన నివాళి



ఉండ్రాజవరంలో చిన్నారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బూరుగుపల్లి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ నాయకుడు బూరుగుపల్లి చిన్నారావు వర్ధంతిని ఉండ్రాజవరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ముందుగా చిన్నారావు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉండ్రాజవరం పంచాయతీ సెంటర్‌లో, గ్రామ కచేరి చావిడి వద్ద చిన్నారావు, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బూరుగుపల్లి చిన్న కృష్ణమూర్తి, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఎస్.సరోజ, ఎంపీటీసీ సభ్యుడు గాడి కిషోర్, సొసైటీ అధ్యక్షుడు సంకు రాత్రి సుబ్బారావు, పాలాటి శరత్‌బాబు, బద్దే వెంకట్రావు, యల్లమిల్లి నారాయణ, కల్యాణాదేవి, బీఎస్సార్ యూత్, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి యంత్ర సాయం

- కొత్త యంత్రాల రాకతో లాభసాటిగా సాగు
- కూలీల కొరత నుంచి విముక్తి
- వేగంగా జీడి గింజలను వేరు చేస్తున్న యంత్రం



జీడి మామిడి కాయలను వేరుచేస్తున్న యంత్రం



జీడిమామిడి కాయల నుంచి గింజలను వేరు చేస్తున్న యంత్రం

చాగల్లు: వ్యవసాయంలో యంత్రాల వాడకం కొన్నేళ్లుగా బాగా పెరిగింది. దీని వల్ల కూలీల కొరత సమస్యను అధిగమించడంతో పాటు, రైతులకు సాగు ఖర్చులు తగ్గుతున్నాయి. వరి, చెరకు వంటి పంటల్లో యంత్రాల వాడకం ఎప్పటి నుంచో ఉన్నా పండ్ల తోటల్లో ఇటీవల వీటి వినియోగం క్రమంగా పెరుగుతోంది. గోదావరి జిల్లాలో జీడిమామిడి పంటను విరివిగా పండిస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో జీడిమామిడి కాయను, గింజను వేరు చేయడానికి కూలీల అవసరం ఎక్కువ. కూలీల కొరత రైతులను ఇబ్బంది పెడుతోంది. ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్న తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మీనానగరం శివారు ప్రాంతంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న పాత్రు శశికాంత్ దీనికి పరిష్కారం కనుగొన్నాడు. జీడిమామిడి కాయ నుంచి గింజను వేరు చేసే యంత్రాన్ని కొనుగోలు చేసి ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నారు. మన దేశంలో ఈ యంత్రం అందుబాటులో లేకపోవడంతో విదేశాల నుంచి ఆయన దిగుమతి చేసుకున్నారు.

సాగులో ఖర్చు తగ్గించుకునేలా..

అమెరికాలో ఐదేళ్లు ఉద్యోగం చేసిన శశికాంత్ వ్యవసాయంపై మక్కువతో సొంత ఊరు వచ్చి దాదాపు 10 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం ప్రారంభించాడు. పాలేకర్ విధానంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నాడు. సాగులో ఖర్చును తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా వివిధ యంత్రాల వాడకాన్ని పరిశీలించి, వాటిని తాను వాడడంతో పాటు స్థానిక రైతులకు పరిచయం చేస్తున్నాడు. ప్రయోగాత్మకంగా కొన్ని యంత్రాలను దిగుమతి చేసుకున్న శశికాంత్ వీటిని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలోని మిగతా రైతులకు పరిచయం చేస్తున్నాడు.

రోజుకు 3 వేల కిలోల గింజల్ని వేరుచేసే అవకాశం

ఒక గంటలో దాదాపు 300 కిలోల జీడిగింజలను కాయల నుంచి ఈ యంత్రం వేరు చేస్తుంది. ఒక రోజులో దాదాపు 3 వేల కేజీల గింజలను వేరు చేసే సామర్థ్యం ఉంది. ఈ యంత్రం నడవడానికి గంటకు దాదాపు 1.2 లీటరు పెట్రోలు సరిపోతుంది. ఒక కూలీ ఉంటే చాలు. ఒక రోజులో దాదాపు 7 ఎకరాల్లోని జీడిమామిడి పండ్ల నుంచి గింజలను వేరుచేయవచ్చు. ఒక సీజన్లో ఎకరం జీడిమామిడి తోటలో కాయ నుంచి గింజలు వేరు చేయడానికి కూలీలను పెట్టుకుంటే దాదాపు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రాంతాన్ని బట్టి కూలీ ఖర్చు పెరుగుతుంది. ఒక కూలీ రోజుకు 50 నుంచి 60 కిలోల గింజలను కాయ నుంచి వేరు చేస్తే, ఈ యంత్రం గంటలో 300 కిలోల గింజల్ని వేరుచేస్తుంది. కావాలనుకుంటే ఈ యంత్రాన్ని అద్దెకు ఇచ్చుకోవచ్చు. మోటార్ సైకిల్‌కు తగిలించి ఎక్కడికైనా తరలించేందుకు అనువుగా ఈ యంత్రం ఉంటుందని రైతు శశికాంత్ చెబుతున్నారు. ఈ యంత్రం కొనుగోలు, వినియోగంపై ఆసక్తిగల రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



దేవరపల్లి శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దేవరపల్లి: స్థానికంగా వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ బ్రహోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాత్రి 8.30 గంటల నుంచి విష్వక్సేన తిరువీధి ఉత్సవం నిర్వహించారు. మాండవీధుల్లో స్వామి వారికి వాహనంపై భక్తులు ఊరేగించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

యోగా, ధ్యాన సాధనతో ఏకాగ్రత మెరుగు

పెరవలి: విద్యార్థులకు యోగా, ధ్యాన శిక్షణ వలన ఏకాగ్రత పెరుగుతుందని ప్రముఖ యోగా ఉపాధ్యాయుడు కరుటూరి విశ్వనాథం తెలిపారు. వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణనిచ్చారు. విద్యార్థులు ఆటలతో పాటు, సంగీతం నేర్చుకోవాలన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయుడు కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వినోదంపాటు విజ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెరవలి, తీపర్రు గ్రంథాలయాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో లైబ్రేరియన్లు యు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన

నల్లజర్ల: గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని రిసోర్సుపర్సన్ టి.సుదర్శన్ అన్నారు.స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథపాలకురాలు ఏవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధ్యాయుల ధర్నా



నిడదవోలులో తహసీల్దార్ నాగరాజునాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు : ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, విద్యా హక్కు చట్టం మేరకు మాతృభాషను కొనసాగించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని నినాదాలు చేశారు. నిడదవోలు మండల, పట్టణ పరిధిలో 30 మంది ఉపాధ్యాయులు ఈ ధర్నాకు హాజరయ్యారు. అనంతరం తహసీల్దారు ఎం.నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రత్తి. సువర్ణ రాజు, పట్టణ అధ్యక్షుడు ఏవీ అప్పారావు, కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, మండలం అధ్యక్షుడు ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

అనసూయకు పలువురి పరామర్శ

దేవరపల్లి: చిన్నాయగూడెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి, ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయను సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత జొన్నకూటి బాబాజీరావు పరిమర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు మేడిబోయిన గంగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడిమళ్ల మహేంద్ర, ఆచంట సురేష్, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.